సాక్షి వికారాబాద్

మంగళవారం ౹ 7 ౹ జనవరి ౹ 2025



మత్తుకు బానిసై

పరిగి పట్టణంలో యువత మత్తు పదార్థా లకు బానిసలవుతున్నారు. అధికారుల కళ్లుగప్పి మత్తులో ఊగుతున్నారు. 8లో▸



రెండు రోజులకే నూరేళ్లు

వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజుల పసికందు మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. 8లో▸



పక్కాగా పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

రూ.59 కోట్ల పత్తి కొనుగోళ్లు



మోమిన్‌పేటలోని అయ్యప్ప కాటన్ మిల్లు వద్ద పత్తి వాహనాలు

మోమిన్‌పేట: స్థానిక అయ్యప్ప కాటన్ మిల్లులో గత శుక్రవారం వరకు సీసీఐ ద్వారా రూ.59 కోట్ల విలువైన పత్తిని కొనుగోళ్లు చేశారు. 2,479 మంది రైతుల నుంచి 80,343 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా రూ.59 కోట్ల 68 లక్షలు చెల్లించాల్సి ఉంది. తద్వారా మర్పల్లి మార్కెట్‌కు ఒక శాతం ఫీజు కింద రూ.60 లక్షల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ నెల చివరి వరకు కొనుగోళ్లు చేస్తే మరింత ఆదాయం వస్తుందని మార్కెట్ సిబ్బంది రఘు తెలిపారు.

పోలెపల్లిలో భూ సర్వే



దుద్యాల్: మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అవసరమైన భూముల సేకరణకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం పోలెపల్లిలో భూ సర్వే ప్రక్రియ చేపట్టింది. తహసీల్దార్ కిషన్ దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామ సర్వే నంబర్ 67లో ఉన్న 71.39 ఎకరాల అసైండ్ భూములకు సంబంధించి సర్వే చేశారు. పట్టాదారు కలిగి ఉన్న సర్వే నంబర్ ఆధారంగా భూమి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. పట్టాదారు పొజిషన్‌లో ఉన్నాడా..? అనే విషయాన్ని సర్వే ఆధారంగా హద్దులు గుర్తిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం హకీంపేట్‌లో 351 ఎకరాలకు సంబంధించి సర్వే ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఆర్‌ఐ నవీన్, సర్వేయర్లు మహేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తాండూరు - వికారాబాద్ రోడ్డు పనులు

ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి

తాండూరు రూరల్: త్వరలో తాండూరు – వికారాబాద్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఖాంజాపూర్ గేటు వద్ద రోడ్డు పనులకు సంబంధించి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు – వికారాబాద్ రోడ్డు విస్తరణ పనులకు రూ.49కోట్ల 78లక్షలు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిందని రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కింగ్ పనులు జరుగుతున్నట్లు వివరించారు. తాండూరు పట్టణంలోని శ్రీనివాస రైస్‌మిల్లు నుంచి రైల్వే బ్రిడ్జి వరకు సీసీ రోడ్డు, గౌతపూర్ ప్రధాన చౌరస్తా నుంచి అల్లాపూర్ వరకు సీసీరోడ్డు వేయనున్నట్లు చెప్పారు. మర్పల్లి నుంచి కోట్‌పల్లికి రూ.42 కోట్లతో రోడ్డు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ శ్రవణ్‌కుమార్, కాంట్రాక్టర్లు హన్మంత్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ప్రజావాణికి 120 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 120 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జైలుకు సురేష్

అనంతగిరి: లగచర్లలో అధికారులపై దాడి చేసిన ఘటనలో ఏ–2గా ఉన్న సురేష్ కస్టడీ సోమవారంతో ముగియడంతో సాయంత్రం సంగారెడ్డి జైలుకు తరలించారు. మూడు రోజుల క్రితం కస్టడీలోకి తీసుకున్న పోలీసులు వికారాబాద్‌లో విచారణ చేపట్టారు. ఘటన జరిగినప్పటి నుంచి సురేష్ పాత్రపై విచారణ చేసినట్లు తెలిసింది.



ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అసదుద్దీన్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

అభివృద్ధి కోసం ఎవరితోనైనా

కలుస్తాం.. పోరాడుతాం

ఆరాంఘర్–జూపార్క్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- వంతెనకు డా.మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం
- రీజినల్ రింగ్‌రోడ్డుతో తెలంగాణ అభివృద్ధి వేగవంతం
- పాతబస్తీ అభివృద్ధికి అసద్‌తో కలిసి పనిచేస్తాం..
- మెట్రో రెండో దశపై ప్రధానితో మాట్లాడా...

సాక్షి, సిటీబ్యూరో/బహదూర్‌పురా /చార్మినార్: గ్రేటర్ నగరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 11 కిలోమీటర్ల అత్యంత పొడవైన పీవీ ఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం తర్వాత..తిరిగి కాంగ్రెస్ హయాంలోనే ఇప్పుడు రెండో అతి పెద్ద ఆరాంఘర్- జూపార్క్ ఫ్లై ఓవర్ ప్రారంభించుకున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగా నిర్మాణమైన ఈ ఫ్లైఓవర్‌ను సోమవారం సాయంత్రం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఏపీలో కానీ, ఇప్పుడు కానీ హైదరాబాద్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ఈ ఫ్లైఓవర్‌కు డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నగర అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అంటూ హైదరాబాద్ అభివృద్ధి కోసం రోడ్ల విస్తరణ, మెట్రో రైలు విస్తరణలతోపాటు గోదావరి జలాలు తేవడం ద్వారా తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన తదితర కార్యక్రమాలు ఒక్కటొక్కటిగా చేస్తున్నామన్నారు. నిజాం కృషితో హైదరాబాద్ నగరానికి లేక్స్ అండ్ రాక్స్ సిటీగా ప్రపంచంలోనే ఒక గొప్ప పేరు ఉండేదని, దాన్ని నిలుపుకొని ఉంటే, ప్రపంచ చిత్రపటంలో హైదరాబాద్‌తో పోటీ పడే నగరమే ఉండకపోయేదన్నారు. కానీ కాలక్రమేణా కబ్జాదారులు, ఆక్రమణల వల్ల నగర సుందరీకరణ పూర్తిగా దెబ్బతిన్నదని, నగరంలో చిన్న వర్షం వచ్చినా వరదలు, ట్రాఫిక్ జామ్స్ తప్పడం లేదన్నారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి కోసం మోదీతో పోరాడాల్సి వచ్చినా, అసద్‌తో కలిసి పనిచేసేందుకైనా సిద్ధమన్నారు. నగరాభివృద్ధి కోసం ఎంఐఎంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రధాని వేరే పార్టీ అయినా నగరాభివృద్ధి కోసం మాట్లాడానన్నారు. అక్బరుద్దీన్ తన చిన్ననాటి స్నేహితుడన్నారు. పాతబస్తీ అభివృద్ధికి ఆయన అడిగిన పనులన్నింటికీ నిధులు మంజూరు చేసే జిమ్మేదారి తనదని భరోసా ఇచ్చారు. మీరాలంపై కేబుల్ బ్రిడ్జి నిర్మించి, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. చర్లపల్లి టెర్మినల్ చాలా కాలం పెండింగ్‌లో ఉండగా, తాను సీఎం అయ్యాక పనులు ముందుకు సాగాయన్నారు. టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానితో మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాటయ్యాక గత పదేళ్లలో హైదరాబాద్ మెట్రో రైలు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్న విషయాన్ని గుర్తుచేశానన్నారు. ముఖ్యంగా గౌలిగూడ, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు సుమారు 7.5 కిలోమీటర్ల మెట్రో పనులకు ఒక్క ఇటుక కూడా పడలేదని, అందుకే హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర మంత్రిమండలి ఆమోదించాల్సిందిగా కోరినట్లు చెప్పారు.

రీజినల్ రింగ్‌రోడ్డుతో అభివృద్ధి

ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం కూడా అత్యవసరమని, అది పూర్తయితే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రీజినల్ రింగ్ రోడ్‌తో పాటు, రీజినల్ రింగ్ రైలును, వికారాబాద్–కొడంగల్–కృష్ణా రైల్వే లైన్ కోసం కూడా కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలుస్తా, ఎవరితోనైనా పోరాడుతా అన్నారు.



ఆరాంఘర్ ఫ్లైఓవర్ ఏరియల్ వ్యూ

ఒరిజినల్ సిటీ ఇదే..

హైదరాబాద్ పాత నగరం కాదని..ఇదే ఒరిజినల్ సిటీ అని, హైదరాబాద్ అభివృద్ధి కోసం 10 లేదా 11వ తేదీన ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంబంధిత అధికారులతో సచివాలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, తాము నిర్మించిన ఫ్లై ఓవర్‌ను రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్నారని బీఆర్‌ఎస్ వాళ్లు చెప్పుకుంటున్నప్పటికీ, తాము అధికారంలోకి వచ్చాకే సరైన సమయానికి నిధులిచ్చి పనులు పూర్తిచేయించామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలో రూ.301 కోట్లతో సీవరేజ్ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

ఎంతమంది జైలుకెళ్తారో నాకైతే తెల్వదు..

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ రాజకీయాలు..జైలు జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్తరేషన్ కార్డులు మంజూరు, రైతులకు ఈ ప్రభుత్వం సహకరించడం మంచి పరిణామమని అంటూ..రేవంత్‌రెడ్డి జైలులో ఉన్నప్పుడు తనకు వంట చేసిపెట్టిన వాళ్లను కూడా మర్చిపోకుండా పిలిపించుకుని సహాయం చేయడం మంచి పరిణామం అన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకులు జైలుకెళ్లడం సామాన్యంగా మారిందని, ఇప్పుడు మాత్రం ఎవరు..ఎంతమంది జైలుకు వెళ్తారో తనకైతే తెలియదన్నారు. తనను కూడా అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు 1998లో జైలుకు పంపారన్నారు. తాను అప్పట్లో 50 రోజులు జైలు జీవితం గడిపానన్నారు. జైలుకెళ్తే కష్టసుఖాలు బాగా తెలుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. జూబ్లీ బస్టాండ్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో రైలును వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. మీరాలం మండి నుండి చార్మినార్ వరకు స్కైవాక్ ఏర్పాటు చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ..పాతబస్తీ ఒవైసీ ఆస్పత్రి, చాంద్రాయణగుట్ట మీదుగా శంషాబాద్ వరకు నిర్మించనున్న మెట్రో రైలు ట్రిపుల్ డెక్కర్ ట్రాన్స్‌పోర్టు సిస్టంలో నడవాలన్నారు. ఇప్పటికే ఈ మార్గంలో కింద రోడ్డు ప్రయాణం కొనసాగుతుండగా పైనుంచి ఫ్లైఓవర్ ఉందన్నారు. ఈ ఫ్లై ఓవర్ పైనుంచి మెట్రో రైలు వెళ్లనుంది అన్నారు. గత ప్రభుత్వం ఓల్డ్‌సిటీని ఇస్తాంబుల్, సింగపూర్‌లా మారుస్తామన్నప్పటికీ, చార్మినార్ పాదచారుల పథకం కూడా పూర్తిచేయలేదన్నారు. టూరిజం పాలసీలో మక్కా మసీదుతోపాటు ఇతర మసీదులను కూడా చేరిస్తే బాగుంటుందన్నారు. ఓల్డ్‌సిటీలో బస్టాండ్లతో పాటు మినీబస్సులు కూడా అందుబాటులోకి తేవాలన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి మార్కింగ్

ఆమనగల్లు: ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్ సిటీ మీదుగా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వరకు నిర్మించే ఎలివేటెడ్ గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు మార్కింగ్ పనులు ప్రారంభమయ్యాయి. 41.5కిలోమీటర్లకు రెవెన్యూ శాఖ నుంచి నోటిఫికేషన్ జారీ చేయగా సర్వే పనులు పూర్తయ్యాయి. మండల పరిధిలోని ఆమనగల్లు, ఆకుతోటపల్లి రెవెన్యూ గ్రామాల్లో రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ చేపట్టనున్నారు. ఆర్‌వీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ అధికారులు 330 అడుగుల రోడ్డు నిర్మాణానికి గాను ఆకుతోటపల్లిలో ఇరువైపులా మార్కింగ్ ఇస్తున్నారు. ఈ పనుల్లో కన్సల్టెన్సీ సిబ్బందితో పాటు ఆమనగల్లు తహసీల్దార్ లలిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంపత్, సర్వేయర్ రవి పాల్గొన్నారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్కింగ్ పనులు మరో రెండు రోజుల సమయం పడుతుందని కన్సల్టెన్సీ సంస్థ వెల్లడించింది.

పనులు ఆపేయాలని వినతి

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు ఆపాలని సాకిబండ తండాకు చెందిన పలువురు రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో, కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఆమనగల్లు తహసీల్దార్ లలితకు సోమ వారం ఆయా గ్రామాల రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో చిన్న, సన్నకారు రైతులకు చెందిన భూములనే కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కున్న అర ఎకరా, ఎకరా భూములను రోడ్డు నిర్మాణంలో కోల్పోతే ఉపాధి లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పనులను ఆపి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో రైతులు మనిపాల్, బోడ్య, చందర్, పాండు, రవిరాథోడ్, విజేందర్, రాజు, వినోద్, గోపి, శివరాం, కుమార్ తదితరులు ఉన్నారు.

‘సాక్షి’ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

‘సాక్షి’ ఆధ్వర్యంలో ఈనెల 8న (బుధవారం) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తాండూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు.



హైదరాబాద్ మార్గంలోని స్థానిక గంగోత్రి విద్యాలయంలో నిర్వహించే పోటీల్లో విజేతలకు స్కూల్ చైర్మన్ ఇందూర్ రాములు సౌజన్యంతో బహుమతులు అందజేస్తారు.

- మొదటి బహుమతి: రూ.10,000
- రెండో బహుమతి: రూ.5,000
- మూడో బహుమతి: రూ.2,000

పూర్తి వివరాలకు:
సెల్: 88853 27301

ఆలయ విస్తరణ దిశగా అడుగులు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పట్టణం బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆలయాన్ని విస్తరించి మౌలిక సదుపాయాలు కల్పించడానికి భావిస్తోంది.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ అధికారులు ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీవారి ఆలయాన్ని ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజుతోపాటు తెలంగాణ దేవాదాయ శాఖ అధికారులు సందర్శించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్తలతో పాటు అధికారులు, పట్టణ ప్రజలతో సమీక్షించారు. ఆలయంలో తీసుకోవాల్సిన పనుల గురించి చర్చించారు. ఆలయ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, మాడ వీధుల విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి పునరావసం తదితర అంశాలపై చర్చించారు. త్వరలో కొడంగల్ శ్రీవారి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పురోహితుడు ధరూర్ శ్రీనివాసాచార్యులు, ఆలయ ధర్మకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధిపై చర్చిస్తున్న అధికారులు

10,00,032 జిల్లాలో ఓటర్ల సంఖ్య

- తుది జాబితాను విడుదల చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రత్యేక ఓటరు నమోదు 2025లో భాగంగా ఓటరు తుది జాబితాను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ విడుదల చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి సమావేశం నిర్వహించి జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 10,00,032 మంది ఓటర్లుగా నమోదైనట్లు తెలిపారు. ఇందులో 4,92,613 మంది పురుషులు, 5,07,644 మంది స్త్రీలు, 45 మంది ఇతర ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. పరిగి నియోజకవర్గంలో మొత్తం 2,71,060 మంది ఓటర్లు ఉండగా 1,35,522 మంది పురుషులు, 1,35,528 మంది స్త్రీలు, 10 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2,34,933 మంది ఓటర్లు నమోదు కాగా 1,16,388 మంది పురుషులు, 1,18,524 మంది స్త్రీలు, 21 మంది ఇతర ఓటర్లు ఉన్నారని చెప్పారు. తాండూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,47,783 ఉండగా 1,19,824 మంది పురుషులు 1,27,952 మంది స్త్రీలు ఏడుగురు ఇతర ఓటర్లు ఉన్నారని తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో 2,46,526 మంది ఓటర్లలో 1,20,879 పురుషులు, 1,25,640 మంది స్త్రీలు, ఏడు ఇతర ఓట్లు ఉన్నట్లు వివరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 549 సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. పరిగిలో 247, వికారాబాద్ 79, తాండూరులో 53, కొడంగల్‌లో 170 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. 1,133 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతగిరి: టీయూటీఎఫ్ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను సోమవారం హైదరాబాద్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మొగులయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్,జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా నాయకులు దేవయ్య, శివప్ప,విష్ణువర్ధన్,బస్వరాజు,సమీయొద్దీన్, బాబు, శ్రీనివాస్, ప్రసాద్, రాఘవేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా..

జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆవిష్కరించారు.



నాల్గో తరగతి ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ, ఇతరులు

అనంతగిరి: తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి రేణుకాదేవి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ఆయా మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్: వాహనదారులు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని గౌతపూర్ సమీపంలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. సీటుబెల్టు విధిగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పవన్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

కొడంగల్ రూరల్: దొంగతనం కేసులో ఓ నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష, రూ. ఐదు వందల జరిమానా విధిస్తూ సోమవారం కొడంగల్ మున్సిఫ్ కోర్టు తీర్పు వెలువరించిందని కొడంగల్ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. హస్నాబాద్ గ్రామానికి చెందిన బోయిని మొగులప్ప ఇంట్లో ఎనిమిదేళ్ల క్రితం 2016 ఆగస్టులో 30 తులాల వెండి కడియాలు దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన స్థానిక పోలీసులు సరైన ఆధారాలు సేకరించి కోర్టుకి సమర్పించారు. పరిశీలించిన కొడంగల్ మున్సిఫ్ కోర్టు ప్రథమశ్రేణి జడ్జి బి.శ్రీరామ్ కుదురుమళ్ల గ్రామానికి చెందిన నిందితుడు మల్లేష్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ.5 వందల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌ఐ తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న లారీ



ప్రమాదానికి గురై బోల్తా పడిన లారీ

యాలాల: లారీ అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట నుంచి తాండూరు వైపు లారీ వస్తోంది. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో డ్రైవర్ నిద్రమత్తుకి జారుకోవడంతో లారీ అదుపుతప్పింది. ఈ క్రమంలో వాహనం కల్వర్టును ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాల సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూపుగా ఏర్పడి.. మత్తుకు బానిసై

ఒకప్పుడు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన మత్తు పదార్థాల కల్చర్ ప్రస్తుతం చాపకింద నీరులా పల్లెలకు విస్తరిస్తోంది. గంజాయి సాగు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించినా గుట్టు చప్పుడు కాకుండా తతంగం సాగుతోంది. గంజాయికి బానిసలుగా మారుతున్న వారిలో ఎక్కువగా విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయం.

- గ్రామాల్లో చాప కింద నీరులా గంజాయి కల్చర్
- జీవితాలు చిత్తు చేసుకుంటున్న విద్యార్థులు
- అడ్డుకట్ట వేయాలని సామాజిక వేత్తల విజ్ఞప్తి

పరిగి: పట్టణంలో యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. అధికారుల కళ్లుగప్పి మరీ గంజాయి మత్తులో ఊగుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా డబ్బులను దొంగలించి గంజాయిని తాగుతున్నట్టు స్థానికంగా సమాచారం. యువత ఒక గ్రూప్‌గా ఏర్పడి గంజాయి ఎక్కడ, ఎవరి దగ్గర లభిస్తుందో సమాచారాన్ని చేర వేసుకుంటున్నారు. విక్రయదారులు సైతం అధికారుల కంట పడకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. కొత్త వారికి కాకుండా రెగ్యూలర్ కస్టమర్లకే విక్రయిస్తున్నట్లు సమాచారం. సరదాగా అలవాటైన గంజాయి, మత్తు పదార్థాలు వారి జీవితాలను మాత్రమే కాదు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. విద్యార్థుల బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తోంది. మత్తులో గొడవలు పడటం, ద్విచక్ర వాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాన్ని నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సామాజికవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల రూప్‌ఖాన్‌పేట్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఆబ్కారి అధికారులు

బలవుతున్న మైనర్లు

పరిగి పట్టణంలోని రెండు, మూడు కాలనీలల్లోని యువత గంజాయికి బానిసలవుతున్నారు. అందులో ఎక్కువ శాతం మైనర్లు కావడం గమనార్హం. గతంలో కూడా పట్టణంలో గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డ వారు మైనర్లే ఉన్నారు. అప్పట్లో విద్యార్థుల తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. పట్టణంలో ఉన్న యువత ఎక్కువగా టీచర్స్ కాలనీ చివరన, ఫైర్‌స్టేషన్ కిష్టమ్మగడ్డతండా సమీపంలో, నస్కల్ వాగు పరిసరాల్లో రాత్రివేళలో గంజాయిని సేవిస్తున్నారు.

నగరం నుంచి సరఫరా

హైదరాబాద్ నుంచి ఇక్కడికి గంజాయి సరఫరా అవుతుంది. పలువురు బడాబాబులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఎక్కువగా మత్తుకు బానిసలుగా అవుతున్నట్టు సమాచారం. పరిగి, దోమ, పూడూరు మండలాల్లో దాదాపు వంద మంది పిల్లలు నిత్యం గంజాయి సేవిస్తున్నట్టు స్థానికంగా సమాచారం. వీరిలో కొంతమంది డ్రగ్స్‌కు సైతం అలవాటు పడినట్లు తెలుస్తోంది. ఇటీవల మండలంలోని రూప్‌ఖాన్‌పేట్ సమీపంలో గంజాయి తరలిస్తున్న యువకుడిని పట్టుకుని కేసు నమోదు చేశారు.

కఠిన చర్యలు తప్పవు

గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గ్రామాల్లో పంట పొలాలో సాగుచేస్తున్న వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. నగరం నుంచి పట్టణానికి సరఫరా అవుతున్న దానిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గంజాయి విక్రయించి, సాగు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– నీరజారెడ్డి, ఆబ్కారి సీఐ, పరిగి

రెండు రోజులకే నూరేళ్లు



పసికందు మృతదేహం



రోదిస్తున్న తండ్రి ఇతర కుటుంబీకులు

- వికారాబాద్ ఆస్పత్రిలో పసికందు మృతి
- డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతోనేనని బాధితుల ఆందోళన
- కేసు నమోదు చేసిన పోలీసులు

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజుల పసికందు మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లికి చెందిన స్వప్న, భిక్షపతి దంపతులకు ఈనెల 4న వికారాబాద్ ఆస్పత్రిలో మగబిడ్డ జన్మించాడు. స్వప్నకు సిజేరియన్ కావడంతో ఆస్పత్రిలోనే ఉన్నారు. బాబు పుట్టిన తర్వాత తల్లీబిడ్డను పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటలకు చిన్నారికి ఒక్కసారిగా ఎక్కిళ్లు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు నర్సుకు తెలియజేశారు. వెంటనే వారు విషయాన్ని డాక్టర్‌కు చేరవేశారు. కానీ డ్యూటీ డాక్టర్ ఎంతకూ రాలేదు. వెక్కిళ్లు అధికమై.. శ్వాస ఆడని స్థితిలో చిన్నారి మృతిచెందాడు.

బాధితుల ఆందోళన..

ఆస్పత్రిలో చిన్నారి మరణించడంతో కుటుంబీకులు ఆందోళనకు దిగారు. డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ బాబు మృతిచెందాడని తండ్రి భిక్షపతి ఆరోపించారు. సకాలంలో వచ్చి చూసిఉంటే ఇంతటి ఘోరం జరిగి ఉండేది కాదని బోరుమన్నాడు. చిన్నారికి వెక్కిళ్లు తగ్గడం లేదనే విషయాన్ని నర్సులు ఫోన్ చేసి చెప్పినా, డాక్టర్ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఉదయం 4.30 గంటల ప్రాంతంలో డాక్టర్ వచ్చి చూడగా ఎలాంటి కదలికలు లేకపోవడంతో సీపీఆర్ చేసి, చనిపోయాడని చెప్పారన్నారు. సదరు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి నచ్చజెప్పడంతో శాంతించారు. భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సీఐ భీంకుమార్ తెలిపారు. ఈఘటనపై ముగ్గురు వైద్యులతో కూడిన కమిటీ వేశామని, ప్రాథమిక విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ రాంచంద్రయ్య తెలిపారు.

కమ్మేసిన పొగమంచు



మండలంలో మూడు రోజుల నుంచి చలి తీవ్రత అధికమవ్వడంతో పాటు పొగమంచు ప్రజలు, వాహనదారులను భయాందోళనకు గురి చేస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చలి తీవ్రత, పొగమంచు తగ్గలేదు. దీంతో ప్రజలు పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ధారూరు నుంచి అవుసుపల్లికి వెళ్లే దారిలో ఇలా పొగమంచు కమ్మేసింది. - ధారూరు

తాండూరు అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి సాగు చేస్తున్న ప్రతి రైతుకి 'రైతు భరోసా' కింద ఎకరానికి రూ.12 వేలు చెల్లిస్తామన్నారు. భూమిలేని నిరుపేదలకు కూడా ఏడాదికి రూ.12 వేలు అందజేస్తామని చెప్పారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కూడా ఈ నెల 26 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. అన్ని మండలాల నుంచి తాండూరు పట్టణానికి రావడానికి మెరుగైన రహదారులు నిర్మిస్తామన్నారు. వికారాబాద్–తాండూరు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఐటీఐ కాలేజీ నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో ఉన్న పాలిషింగ్ యూనిట్లు పట్టణ శివారులోకి తరలిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో మరో నాలుగేళ్లలో తాండూరు రూపురేఖలు మారిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ధారాసింగ్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, శోభరాణి, నర్సింలు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కంటి వైద్య శిబిరం

ఆరోగ్యమే మహాభాగ్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలో ఎల్ఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్ఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

మొయినాబాద్: దైవ దర్శనానికి వచ్చిన ఓ మహిళ మెడలోంచి గుర్తుతెలియని దుండగుడు మూడు తులాల బంగారు గొలుసు దొంగిలించాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నగరంలోని యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు ఆదివారం కుటుంబ సమేతంగా చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చారు. ఆలయం వద్ద ఓ గుర్తుతెలియని దుండగుడు ఆంజనేయులు తల్లి గోవిందమ్మ మెడలోంచి మూడు తులాల బంగారు గొలుసును దొంగిలించాడు. ఈ విషయమై సోమవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

అనంతగిరి: వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుభాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టెఫిన్ టైటాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 5 కంపెనీలు అయిన బిగ్ బాస్కెట్, స్విగ్గి, జెప్టో, యెరేకా ఫోర్బ్స్, డిమార్ట్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 200 వరకు పోస్టులు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676047444లో సంప్రదించాలన్నారు.

క్రిస్టియన్ మైనార్టీలకు ఉచిత కుట్టు మిషన్లు

అనంతగిరి: తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హన్మంతురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రిస్టియన్ మైనార్టీ మహిళలు జనవరి 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో టీజీవోబీఎంఎంఎస్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెల్ల రేషన్‌కార్డు ఉండి పట్టణ ప్రాంతాల్లో ఆదాయం 2లక్షలు, గ్రామాల్లో లక్షన్నరలోపు ఆదాయం ఉన్న వారు అర్హులన్నారు. కనీసం 5వ తరగతి చదివి ఉండాలన్నారు. 18–55 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. తెలంగాణ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుంచి నేర్చుకున్న టైలర్ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7993357103లో సంప్రదించాలన్నారు.

అన్నంపెట్టిన ఇంటికే కన్నం!

ఇబ్రహీంపట్నం రూరల్: అన్నం పెట్టిన ఇంటికే కన్నం వేశాడో వ్యక్తి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. శ్రీవిహార్, రాగన్నగూడలో నివాసం ఉండే పెరుమల్ల అమృత, తన ఇంట్లో పనులు చేయడానికి కేతావత్ శ్రీనును నియమించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 4న ఇంట్లో 295 గ్రాముల వెండి ప్లేటు, 30 గ్రాముల వెండి గ్లాసు కనిపించడం లేదని గుర్తించింది. అనంతరం శ్రీనుపై అనుమానం వ్యక్తం చేస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

యువకుడి బలవన్మరణం

శంకర్‌పల్లి: రైలు కింద పడి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి శంకర్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఫత్తేపూర్‌కు చెందిన రాములు, అంజమ్మ దంపతుల కుమారుడు మనోహర్(26) స్థానికంగా పశువుల దాణా దుకాణం ప్రారంభించాడు. ఫత్తేపూర్ శివారులోని రైల్వే పట్టాల మీదకు వెళ్లి ఎదురుగా వస్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గమనించిన స్థానికుల సమాచారం మేరకు వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని కేసు నమోదు చేశారు. శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం వికారాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కాగా దుకాణం కారణంగా అప్పులై ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు

బ్లాస్టింగ్‌పై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం ఎలాంటి అనుమతి లేకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు యాచారం సీఐ నర్సింహారావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం మండలం తమ్మలోనిగూడ వెంచర్‌లో కొత్తపల్లి గ్రామానికి చెందిన బోదాసు రవి, శ్రీనివాసులు బ్లాస్టింగ్ చేస్తున్నారు. సమాచారం మేరకు ఇరువురిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



కొడంగల్: సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఇతరులు

కొడంగల్ ఓటర్లు 2.46 లక్షలు

వెల్లడించిన అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్


కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,46,526 మంది ఓటర్లు ఉన్నారని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. పురుషులు 1,20,879 మంది, స్త్రీలు 1,25,640 మంది, ఇతరులు ఏడుగురు ఓటర్లుగా ఉన్నారని ప్రకటించారు. దౌల్తాబాద్ మండలంలో మొత్తం 40,687 మంది, మద్దూరులో 38,789 మంది, కొత్తపల్లి మండలంలో 16,761 మంది, కోస్గి మండలంలో 36,404 మంది, గుండుమాల్‌లో 17,569 మంది, బొంరాస్‌పేటలో 32,388 మంది, దుద్యాల్‌లో 24,537 మంది, కొడంగల్‌లో 39,391 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంత మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, అఖిల పక్ష నాయకులు రమేష్‌బాబు, శంకర్ నాయక్, ఆసీఫ్‌ఖాన్, గుల్షన్, మోహన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో 36 వేల ఓటర్లు

ధారూరు: తుది ఓటరు జాబితాను మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సాజిదాబేగం ప్రదర్శించారు. మండలంలో 2025 జనవరి 1 వరకు మొత్తం 36,100 మంది ఓటర్లు నమోదయ్యారని, జాబితాను మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ప్రదర్శిస్తామని ఆమె తెలిపారు. మండలంలో పురుషులు 17,739 మంది, స్త్రీలు 18,361 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ విజయేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు నిలపొద్దు

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు రాకుండా అరికట్టాలని తాండూరు డిపో కంట్రోలర్ పట్లోళ్ల నర్సింహారెడ్డి సోమవారం కొడంగల్ ఎస్‌ఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు డిపో మేనేజర్ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొడంగల్ బస్టాండ్‌లో అనధికారికంగా వాహనాలను నిలపడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. కొంత మంది ద్విచక్ర వాహనాలను ఆపి దౌర్జన్యం చేస్తున్నారన్నారు. బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం ఉందన్నారు. అందులో వాహనాలను ఆపితే సమస్య ఉండదన్నారు. పార్కింగ్ స్థలంలో కాకుండా బస్సులు తిరిగే స్థలంలో మోటార్ సైకిళ్లు, ఆటోలు, జీపులు, కార్లను ఆపుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది రాములు, రాజేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న కంట్రోలర్

విద్యార్థిని అనుమానాస్పద మృతి

- పూర్తిస్థాయి విచారణకు తల్లిదండ్రుల డిమాండ్
- కేసు నమోదు చేసిన ఆదిబట్ల పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ ప్రైవేటు కళాశాలలో ఉంటూ నీట్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా, పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మైలపాకం అర్జున్ కూతురు సోని(19).. ఆదిబట్లలో అగస్త్య జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ.. నీట్ కోచింగ్ తీసుకుంటోంది. ఈనెల 4న జ్వరం రావడంతో ఆమెను మన్నెగూడలోని మహోనియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు చెప్పగా.. వైద్య ఖర్చులకు రూ.వెయ్యి ఫోన్ పే చేశారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు కడుపు నొప్పి రావడంతో వైద్యం చేయించారు. 5న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మరోసారి కడుపునొప్పి రావడంతో అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని యశోదకు తరలించారు. అప్పటికే సోని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా.. అప్పుడప్పుడు సోనికి మైగ్రేన్ వస్తుండేదని, ఆమె మృతిపై సరైన విచారణ జరపాలని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



సోని మృతదేహం

రూ.12 లక్షల పరిహారం..?

యువతి మృతిపై తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ ఆందోళన చేయడంతో రాత్రికి రాత్రే రూ.12 లక్షల నష్టపరిహారం చెల్లించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా.. ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో వారు పూలకుండీలు, కుర్చీలు ధ్వంసం చేయగా.. వారిపై యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పంటను అమ్మేందుకు వెళ్తుండగా ప్రమాదం

ఆస్పత్రికి తరలించే క్రమంలో యువకుడి మృతి

కందుకూరు: పంటను అమ్ముకునేందుకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పరమేశ్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం బాలన్‌పల్లికి చెందిన బారు భరత్(20) ఐటీఐ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా తమ పొలంలో పండించిన మిర్చి పంటను ఎండిన తర్వాత గ్రామస్తులు కొమ్ము దయాకర్, పసుపుల కుమార్, ఎం.రమేశ్, జి.సాయి డ్రైవర్ వెలిజల శివకుమార్‌తో కలిసి ఆదివారం రాత్రి హైదరాబాద్ మార్కెట్‌కు బయలు దేరారు. వీరంతా బొలేరో క్యాబిన్ టాప్‌పై కూర్చున్నాడు. మార్గమధ్యలో రాత్రి 11గంటల సమయంలో శ్రీశైలం రహదారి దెబ్బడగూడ గేట్ సమీపంలో కందుకూరు నుంచి కడ్తాల్‌వైపు అతి వేగంగా వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో టాప్ పైన కూర్చున్నవారంతా కిందపడగా భరత్‌కుమార్‌కు తీవ్రగాయాలవ్వగా.. మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా భరత్ మార్గ మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు సీఐ సీతారామ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పరమేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.



భరత్ (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మొయినాబాద్: పురుగు మందు ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సురంగల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సురంగల్‌కు చెందిన కుమ్మరి కిష్టయ్య(55) కూలీ. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం మరింత క్షీణించడంతో మనస్తాపంతో ఈ నెల 2న ఇంట్లో పురుగు మందుతాగాడు. గమనించిన చుట్టు పక్కలవారు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి మరింత విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

వృద్ధుడి అదృశ్యం

కేశంపేట: ఇంట్లో నుంచి బయటి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధి పాపిరెడ్డిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందాడ కృష్ణయ్య(62) జనవరి 1న మళ్లీ వస్తానని ఇంట్లోవారికి చెప్పి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. అప్పటి నుంచి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆయన ఆచూకీ లభ్యం కా లేదు. కృష్ణయ్య కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు సోమ వారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు సీఐ నరహరి తెలిపారు. అదృశ్యమైన వ్యక్తి తెల్లని పంచ, నల్లని టీషర్టు ధరించాడని, వివరాలు తెలిసిన వారు 8712568396 నంబర్‌కు తెలియపర్చాలని సీఐ కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... దుర్గానగర్ బస్టాండ్ ప్రాంతంలో అనారోగ్యంతో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నట్లు సమాచారం అందింది. సదరు వ్యక్తి 55–60 సంవత్సరాల మధ్య ఉండి స్థానికంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని పోలీసులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.